క్లుప్తంగా

ఐసీడీఎస్ పీడీ విచారణ



విచారణ చేస్తున్న పీడీ

సాలూరు: అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బలగ రాధపై వచ్చిన ఆరోపణలపై ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి శనివారం విచారణ చేపట్టారు. సాలూరులోని రామాకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రా–3కి వెళ్లి గర్భిణులు, బాలింతల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట సీడీపీఓ సత్యవతి ఉన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు, క్రీడా సామగ్రి వితరణ



పాఠశాలకు అందించిన ఫ్యాన్లు

సాలూరు: పట్టణంలోని మహాత్మాజ్యోతిపూలే గురుకుల పాఠశాలకు విదేశాల్లో నివసిస్తున్న కంచర్ల వారి కుటుంబ సభ్యులు ఫ్యాన్లు, స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందించారు. సుమారు రూ.60 వేలు విలువ చేసే సామగ్రిని బలగ గణేష్ మాస్టారు ద్వారా అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దాతలకు పాఠశాల ప్రిన్సిపాల్ మూకల పెంటయ్య, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజ్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా ఇప్పల పోలమ్మ



శాకంబరిదేవి అలంకరణలో ఇప్పల పోలమ్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామదేవత ఇప్పలపోలమ్మ శాకంబరిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఖరీఫ్‌కు ఎరువులు అందుబాటులో ఉంచాలి



ఖరీఫ్ ఎరువులు పంపిణీని వివరిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని ఖరీఫ్ పంటలసాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, వివిధ శాఖలు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల సభ్యులు కోరారు. ఎంపీపీ బి.రవణమ్మ అధ్యక్షతన శనివరాం మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుచ్చిమి, లచ్చయ్యపేట, గెడ్డలుప్పి ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మంచినీరు సరఫరా, పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని కోరారు. ఎంపీపీ కలుగ జేసుకుని గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న పారిశుధ్య పక్షోత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, సర్పంచ్‌లు, వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్, విద్యుత్, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాడిపశువుల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి

సీతానగరం: మండలంలోని మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పశువులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, పాడిపశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సబ్‌డివిజినల్ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో శనివారం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో వీధుల్లో ఉన్న విద్యుత్ స్తంభాల సమీపంలో పశువులను కట్టవద్దని, నేలలు పదునుగా ఉన్నందున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అన్నారు. అలాగే కళ్లాలలో నిల్వ ఉంచిన వరిగడ్డి కుళ్లిపోయే అవకాశం ఉందని, వరి గడ్డిలో తేమను పరిశీలించి పశువులకు వేయాలని సూచించారు. వరిగడ్డికి బదులుగా పచ్చిగడ్డి ఉత్పత్తి నిమిత్తం 70 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు వాటిని వినియోగించుకోవాలని కోరారు.

పంట నీటమునిగితే ఆందోళన వద్దు

- ముంచెత్తిన ముసురుతో నీట మునిగిన పంటపొలాలు
- సస్యరక్షణతో పంటనష్టం నివారణ
- రైతులకు వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి సూచనలు





పాలకొండ-భాసూరు పరిసరాల్లో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు, కాలువల్లో వరదనీరు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. పంటపొలాలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారుల హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలో సుమారు 18 వేల హెక్టార్లలో వరి వెదలు వేసుకున్నారు. మరికొన్ని చోట్ల వరినాట్లు పూర్తయ్యాయి. పంట మొలక దశలో ఉన్న సమయంలో నీట మునగడంతో పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు రైతులు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి వివరించారు.

విత్తనం వేసిన 2–3 రోజుల్లో..

విత్తనం వేసిన 2–3 రోజుల వ్యవధిలో ముంపునకు గురైతే మొలక శాతం తగ్గే ప్రమాదం ఉంది. రైతులు తమ మడిలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. దీని వలన విత్తనంకు గాలి తగలటంతో మొలక త్వరగా వస్తుంది. విత్తనం 7–30 రోజుల మధ్య నారు మడిలో 5 రోజుల కంటే ఎక్కువ నీరు నిలిచి ఉంటే నారు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ తరుణంలో నీరు పూర్తిగా బయటకు పోనివ్వాలి. గాలి తగిలేలా చేయాలి. తర్వాత 5 సెంట్లు నారు మడికి 1 కిలో యూరియా, 1 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయటం వలన కొత్త ఆకులు తొగిడి నాట్లు వేయటానికి వీలుంటుంది. తెగుళ్ల అధికంగా ఆశించే క్రమంలో నీరు తీసిన తరువాత మొక్క నిలదొక్కుకున్న క్రమంలో తెగుళ్ల నివారణకు గ్రాము కార్బండిజిం లేదా మాంకోజెబ్, కార్బండిజిం మిశ్రం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పైపాటుగా పిచికారి చేయాలి.

నారుమడుల్లో..

నాట్లు వేసిన మడులు ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు వెళ్లేలా చూడాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా పైపాటుగా వేయటం శ్రేయస్కరం. నీరు పూర్తిగా తీయలేకుంటే ఆకుపై 2 శాతం యూరియా లేదా మూడు 19లు పిచికారీ చేయాలి. వరి నాట్లు పూర్తిగా కోలుకున్న తరువాత సాధారణ, కుళ్లు తెగుళ్లను అధిగమించేందుకు గ్రాము కార్బండిజిం లేదా మాంకోజెబ్, కార్బండిజిం మిశ్రమం లీటరు నీటికి 2 గ్రాముల వంతున కలిపి పైపాటుగా పిచికారీ చేయాలి.

వెదపొలాల్లో..

వెదలు జల్లిన వెంటనే వర్షాలు అధికమైతే మొలక శాతం ఘననీయంగా దెబ్బతింటుంది. ఈ క్రమంలో మడిలో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేయాలి. వీలైనంత త్వరగా నీరు బయటకు పోనించి ప్రకృతి గాలికి విత్తనం ఆరేలా చేయాలి. దీనివల్ల మొలక త్వరగా వస్తుంది. విత్తనం వెదలు జల్లి 10–30 రోజులు వ్యవధిలో వర్షాల కారణంగా 5 రోజుల మేరా నీటి ముంపునకు గురేతై నీరు బయటకు పోనిచ్చి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులు బూస్టర్ డోస్‌గా పైపాటుగా వేయాలి. నీటి ఉధృతిని కట్టడి చేయలేకుంటే ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా అయినా నీటిని తొలగించే యత్నం చేయాలి. బయటకు కనిపించే ఆకుపై 2 శాతం యూరియా లేదా మూడు 19లు పిచికారి చేయటం వలన పైరు కోలుకుంటుంది. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి కార్బన్‌డిజం, మాంకోజెబ్ 2 గ్రాములు లేదా గ్రాము కార్బన్‌డిజం మిశ్రమాన్ని కలిపి పిచికారి చేయటం వలన ఫలితం ఉంటుంది.



రాజుపేట సమీపంలో పొలంలోని నీటిని బయటకు తరలించేందుకు ఉపక్రమిస్తున్న రైతు

రాజన్నదొర పరామర్శ



జీగిరాంలో ఎంపీటీసీ సభ్యుడు సూరప్పలనాయుడుని పరామర్శిస్తున్న రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం సర్పంచ్, జీగిరాం ఎంపీటీసీ సభ్యుడిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శనివారం పరామర్శించారు. శివరాంపురం సర్పంచ్ జరజాపు మోహన్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డారు. అలాగే జీగిరాం ఎంపీటీసీ సభ్యుడు సూర అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న రాజన్నదొర వారిని పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీను, తెంటు నరసింహులు, కెగువ నారాయణరావు, తదితరులు ఉన్నారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురంటౌన్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. పట్టణంలోని వసతి గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టల్స్‌లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దుప్పట్లు, టంకు పెట్టెలు, దోమ తెరలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 8 నెలలుగా మెస్ బిల్స్ చెల్లించకపోవడంతో హాస్టల్స్ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. అలాగే దోమతెరలు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహాల్లో ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వార్డెన్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ హరికృష్ణ, వికాస్, దుర్గా, మనీ, శరత్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి

- రిపబ్లికన్ పార్టీ స్టేట్ సెక్రటరీ గొంప ప్రకాశరావు

సాలూరు: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, ఇక్కడి పరిస్థితులు మణిపూర్ ఘటనలను గుర్తుచేస్తున్నాయని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని రిపబ్లికన్ పార్టీ స్టేట్ సెక్రటరీ గొంప ప్రకాశరావు కోరారు. పట్టణంలో శనివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, పసిపిల్లలపై అత్యాచారాలు, హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టపగలు నడిరోడ్డుపై మనుషుల్ని ముక్కలుగా నరకుతున్న ఘటనలు చూసి అమాయక ప్రజలు భీతిల్లిపోతున్నారని అన్నారు. దళితులు, అమాయకుల భూముల్ని ఆక్రమించుకోవడాన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు.

ఈ అంశాలను గవర్నర్‌కు తాను రాసిన లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఘోరంగా విఫలమైనా రాష్ట్ర హోంమంత్రి ఎటువంటి చర్యలు తీసుకుపోగా, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించేలా ఆదేశాలు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ కలుగజేసుకుని రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు.

కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ



కౌలురైతులకు సీసీఆర్‌సీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: మండలంలోని కౌలురైతులకు పంపిణీ చేసిన సీసీఆర్‌సీ కార్డులను కౌలురైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు కౌలురైతులకు సీసీఆర్‌సీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలురైతులందరికీ పంటల సాగుకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందించడానికి ఉపయోగపడతాయని, బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించడానికి దోహదపడతాయన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఏఓ ఎస్.అవినాష్, ఎంపీడీఓ ఈశ్వరరావు, రైతు నాయకులు ఎస్.హరిగోపాలరావు, బి.శ్రీరాములనాయుడు, బి.తిరుపతిరావులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యా ర్థులు ఈనెల 25వ తేదీలోగా విద్యార్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నా రు. ఈనెల 27న సీతంపేట ఐటీఐలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నా రు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకాని క్, వెల్డర్, కోపా, డ్రెస్‌మేకింగ్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ప్రజలు భాగస్వాములు కావాలి



పెదబోగిలిలో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ తేరేజమ్మ, పంచాయతీ సిబ్బంది

సీతానగరం: పెదబోగిలి మేజరు పంచాయతీ చేపడుతున్న పారిశుధ్య పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ కోరారు. సర్పంచ్ జే తేరేజమ్మ ఆధ్వర్యంలో సీతానగరం, పెదబోగిలి, సుంకరివీధి, గూడెం, అప్పయ్యపేట కాలనీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులతో కలిగి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచొచ్చన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, గరికయ్య, పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


చురుగ్గా లెప్రసీ సర్వే



లెప్రసీ సర్వే చేస్తున్న అర్బన్ వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: కుష్టువ్యాధి నివారణ లక్ష్యంగా సమగ్ర సర్వే చేపడుతున్నట్లు అర్బన్ హెల్త్ సెంటర్ ఏపీఎంఓ వి.ప్రసాద్ అన్నారు. పట్టణ పరిధిలో వీవ ర్స్ కాలనీ, కొత్తవీధి, రెల్లివీధి సమీప ప్రాంతాల్లో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించా రు. శరీరంపై స్పర్శలేని తెల్లని మచ్చలు ఉన్నట్లుయి తే వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవా లని సూచించారు. సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.అమరవేణి, ఆశా వర్కర్ కె. గౌరీశ్వరి సర్వేలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలి



ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: గెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా వరహాల గెడ్డ అవుట్ లెట్స్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఏడు కానాల వద్ద బ్లాక్ అయిన సిల్ట్‌ను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులను ప్రారంభించారు. రైల్వే సిబ్బందితో మాట్లాడి వర్షపు నీరు సక్రమంగా పోయే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

సాగునీరు విడుదల



సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, తదితరులు

సీతానగరం: మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన సీతానగరం ఆనకట్ట నుంచి సాగునీటిని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర శనివారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం వ్యవసాయరంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులను బలోపేతం చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సీతానగరం ఆనకట్ట పరిధిలో చేపట్టాల్సిన మరమ్మతు పనులకు సంబంధించిన అంచనాలు వేసి తనకు అందజేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి కాలువల్లో తుప్పలు, డొంకలు తొలగింపు పనులు చేపట్టాలని, శివారు భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. కాలువను బాగుచేయించి అన్ని గ్రామాలకు సాగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, తెంటు వెంకటఅప్పలనాయుడు, మూడడ్ల వెంకటనాయుడు, సూర్యనారాయణ, టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేలమట్టమైన మొక్కజొన్న



నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు కృష్ణ

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునిగినివలస గిరిజన రైతు ఓలిసి కృష్ణకు చెందిన మొక్కజొన్న పంట శనివారం సాయంత్రం వీసిన ఈదురుగాలులకు నేలమట్టమైంది. ఖరీఫ్ ప్రారంభంలో వాతావరణం అనుకూలించడంతో కౌలుకు తీసుకున్న ఎకరం భూమిలో మొక్కజొన్న విత్తనాలు వేశాడు. ప్రస్తుతం పంట ఏపుగా పెరిగడంతో దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. చుట్టుపక్కల రైతులందరికంటే తన పంట బాగుండటంతో తన కష్టానికి తగిన ఫలితం వస్తుందని ఆశపడ్డాడు. ఇంతలోనే ఈదురుగాలులకు పంట మొత్తం ధ్వంసం కావడంతో లబోదిబోమంటున్నాడు. రూ.20 వేలు అప్పు చేసి సాగుకు మదుపు పెట్టానని, ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదని వాపోతున్నాడు. గ్రామంలో కృష్ణతో పాటు మరికొందరు రైతులకు చెందిన మొక్కజొన్న పంట కొంతవరకు దెబ్బతిందని గ్రామస్తులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీరాజ్ అధికారి

పార్వతీపురంటౌన్: మండలంలోని సంగంవలస గ్రామంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇళ్లలోని చెత్త వీధుల్లో వేయకుండా డస్ట్‌బిన్స్‌లో వేసి చెత్తసేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

- రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురంటౌన్:

కళాశాలల్లో ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు తప్పవని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్.దామోదరరావు అన్నారు. స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తోటివారిని వేధించడం, అవమానకరంగా మాట్లాడటం చట్టవేతిరేకమన్నారు. తోటివారి హక్కులను కాలరాసేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థినులు, మహిళలు దిశా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పిలకారు. చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని, చెడు సావాసాలు అలవాటు చేసుకోకూడదని హితవు పలికారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్యాజాస్మిన్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు వారి ఆలోచనా ధోరణి మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు మెడల్స్‌తో సత్కరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, లోక్ అదాలత్ మెంబర్ టి.జోగారావు, కళాశాల ప్రిన్సిపాల్ పెంట అప్పారావు, సీనియర్ లెక్చరర్ వివేకానంద, సిబ్బంది, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి



ఏఐటీయూసీ మన్యం జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ మన్యం జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ కోరారు. ఏఐటీయూసీ మన్యం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ చట్టం 2006 పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సహజ మరణాలు, ప్రమాదం, అంగవైకల్యం, ప్రసూతి తదితర క్లెయిములన్నీ కలిపి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 56 వేలకుపైగా పెండింగ్‌లో ఉండగా జీవో నంబరు 17 తీసుకొచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం జీవో 17ను రద్దు చేసి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. గత నాలుగేళ్లుగా లేబర్ ఆఫీసుల్లో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉచిత ఇసుక పాలసీలో కూడా సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ వసతిగృహంలో వైద్యశిబిరం నిర్వహించాలి

జియ్యమ్మవలస:

సంక్షేమ వసతి గృహంలో ఆరోగ్య కార్యకర్తలను నియమించి విద్యార్థులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర అన్నారు. రావాడ రామభద్రపురం సంక్షేమ వసతిగృహాన్ని శనివారం పరిశీలించారు. వసతిగృహంలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. వసతిగృహంలో గతంలో నాడు-నేడు కార్యక్రమంలో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు గురైందని గుర్తించారు. సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్ పాడవ్వడంతో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందక రోగాల బారిన పడుతున్నారన్నారు. వసతి గృహంలో 236 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య కార్యకర్తలను నియమించకపో వడాన్ని తప్పుపట్టారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆరోగ్య కార్యకర్తల నియామకం చేపట్టా లని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మణరావు, జిల్లా సహాయ కార్యదర్శి మండంగి రమణ ఉన్నారు.